క్లుప్తంగా

ప్రసన్నాంజనేయుడికి వెండి కిరీటం బహూకరణ



ఫిరంగిపురం: 113 తాళ్లూరు గ్రామంలోని ప్రసన్నాంజనేయస్వామికి సత్తెనపల్లి మండలం ఫణిదం గ్రామానికి చెందిన ప్రసాద్, ఆదిలక్ష్మి దంపతులు సోమవారం వెండి కిరీటం బహూకరించారు. ఉదయం స్వామివారికి పంచామృతాలతో వేదపండితులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శ్రీసూక్త, పురుషసూక్తాలతో స్వామికి కిరీటాన్ని అలంకరించి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. కార్యక్రమంలో వేద పండితులు ప్రసన్నాచార్యులు, వినయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి చెక్కు అందజేత

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మార్కెట్ యార్డులో ఔట్ సోర్సింగ్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన పాండురంగారావు కుటుంబానికి మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవు చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అయిన పాండురంగారావు కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో మార్కెట్ యార్డు అధికారులతో మాట్లాడి రూ.4 లక్షల పీఎఫ్ వచ్చే విధంగా స్థానిక అధికారులు కృషి చేశారని తెలిపారు. పాండురంగారావు కుటుంబానికి ఆ చెక్కును అందజేయడంతో పాటు వైఎస్సార్ బీమా కింద రూ.2 లక్షల చెక్కును కూడా ఆ కుటుంబానికి అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్‌కే బాజి, వైస్ చైర్మన్ కొండూరు ముత్తయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


100 మందికి పైగా విద్యార్థులు రక్తదానం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వై.సుజిత్

మోతడక(తాడికొండ): తాడికొండ మండలం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల హెల్త్ కేర్ పార్టనర్ అయిన సూట్స్‌కేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ శిబిరానికి విద్యార్థులు, అధ్యాపకుల నుంచి మంచి స్పందన లభించింది. సుమారు 100 మందికి పైగా విద్యార్థులు రక్తదానం చేశారు. క్యాంపును కళాశాల కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలు కాపాడేందుకు రక్తదానాన్ని మించిన దానం మరొకటి లేదన్నారు. కార్యక్రమంలో ఎంబీబీఎస్ వైద్యులు డాక్టర్ కొత్తమాసు దినేష్, ఎంబీబీఎస్, ఎండీ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కామేశ్వరి, డాక్టర్ లోకేష్, డాక్టర్ కార్తీక్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాసరావు, డాక్టర్ ఆర్.అరుణ, సూట్స్ కేర్ నెట్‌వర్క్ పీడీ సీహెచ్ కార్తీక్, వై.వెంకట్, ఎం.రాజా, జి.ప్రతాప్, అమర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నియోజకవర్గ కన్వీనర్‌గా బ్రహ్మయ్య



తాడికొండ: భారతీయ జనతా పార్టీ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్‌గా తుళ్లూరు గ్రామానికి చెందిన కంతేటి బ్రహ్మయ్యను ఎంపిక చేశారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటనలో తన ఎంపికను తెలిపారు. తనపై నమ్మకంతో నియోజకవర్గ కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆరోగ్య కేంద్రానికి కుర్చీల బహూకరణ

మంగళగిరి: మంగళగిరి –తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని యర్రబాలెంలో డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు అదే ప్రాంతానికి చెందిన వెలిమిచర్ల శివన్నారాయణ తన తల్లిదండ్రులు వెలిమిచర్ల సీతారామయ్య, లక్ష్మీకాంతమ్మ జ్ఞాపకార్థం మంగళవారం 20 కుర్చీలను బహూకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డాక్టర్ వి.రాజేష్ మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి దాత కుర్చీలను అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి లక్ష్మీమనోహర్, గోపిశెట్టి శరత్‌కుమార్‌తో పాటు పలువురు ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్థాయిగా గుర్తుంచుకునేలా నేతన్న విగ్రహం

ఎన్నారై జంక్షన్ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



ఎన్నారై వై-జంక్షన్‌లో నేతన్నల విగ్రహాల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు.శారదాదేవి తదితరులు

మంగళగిరి: మంగళగిరి అంటే చేనేత పరిశ్రమకు పెట్టింది పేరు అని, చిరస్థాయిగా భావితరాలు గుర్తుంచుకునేలా నేతన్న విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) తెలిపారు. మంగళవారం ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి ఎమ్మెల్యే ఆర్కే ఎన్నారై వై-జంక్షన్ మధ్యలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ వ్యవసాయం తరువాత అంతటి ప్రాధాన్యత కలిగిన రంగం, అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న చేనేత పరిశ్రమ చిరస్థాయిగా గుర్తుకు వచ్చేలా నగర ముఖద్వారం ఎన్నారై వై జంక్షన్‌లో నేతన్న విగ్రహంతో పాటు చేనేత పరిశ్రమలోని వివిధ ఉప వృత్తుల విగ్రహాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నగరంలోకి అడుగుపెట్టేవారితో పాటు విజయవాడ, గుంటూరు మధ్య తిరిగే వారికి స్వాగతం పలికేలా నేతన్న విగ్రహం ఏర్పాటు చేసి పరిశ్రమను భవిష్యత్తు తరాలు గుర్తుకుతెచ్చుకునేలా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీ జాతీయ చేనేత దినోత్సవం నాటికి నేతన్నల విగ్రహాలు ఏర్పాటు చేసి ఆవిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు తెలిపారు.

జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలు ఏర్పాటు..

సంఘ సంస్కర్తలు, సమ సమాజం కోసం పోరాడిన మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ఎన్నారై వై జంక్షన్‌లోని సెంటర్‌లో ఉన్న ఖాళీ స్థలంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసి వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి..

ఎన్నారై ఆసుపత్రి నుంచి చినకాకాని వై-జంక్షన్ వరకు పెండింగ్‌లో ఉన్న రోడ్డు విస్తరణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని నగర పాలక సంస్థ అధికారులకు ఎమ్మెల్యే ఆర్కే సూచించారు. వై జంక్షన్ నుంచి ఎన్నారై ఆసుపత్రి సమీపంలోని లేళ్ల వాగు వరకు రోడ్డును, డ్రైనేజీలను పరిశీలించారు. ఆసుపత్రి నుంచి వైజంక్షన్ వరకు వెంటనే రోడ్డు విస్తరణ చేపట్టి పనులు సత్వరమే పూర్తి చేయాలని అధికారులను కోరారు.

వర్షాకాలం నాటికి పెద్దకోనేరు అభివృద్ధి పనులు పూర్తిచేయాలి..

నగరంలో వేంచేసిఉన్న లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన పెద్ద కోనేరు (కల్యాణ పుష్కరిణి) అభివృద్ధి పనులు రానున్న వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆర్కే అధికారులకు సూచించారు. కోనేరులో మిగిలిన మురుగు, మట్టిని తొలగించేందుకు మంగళవారం అధికారులు భారీ జేసీబీని ఏర్పాటు చేశారు. కోనేరులో పని చేస్తున్న కార్మికులతో కొబ్బరికాయ కొట్టించి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పురాతన పెద్ద కోనేరు చరిత్రను భావితరాలకు అందించడమే లక్ష్యమన్నారు. కోనేరు అభివృద్ధికి అదనపు నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మంజూరు చేసేలా కృషి చేస్తామన్నారు. అనంతరం పెదకోనేరులోని ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, నగర కమిషనర్ యు.శారదాదేవి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి, పద్మశాలీయ సంఘం నాయకులు దామర్ల కుబేరస్వామి, జొన్నాదుల బాబూ వరప్రసాద్ (మణి), రామనాథం పూర్ణచంద్రరావు, పిల్లలమర్రి బాలకృష్ణ, పిల్లలమర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సంకా బాలాజీ గుప్తా, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, నేరెళ్ల మురళి, శివాలయం ట్రస్టు బోర్డు సభ్యులు కొల్లి మునలారెడ్డి, అద్దంకి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న మోడల్ హౌస్ కేటాయింపు

- అనుకోని అతిథిగా వెళ్లిన ఆర్కే
- కుటుంబానికి బహుమతి అందజేత



కిన్నెర కమలకుమారి కుటుంబానికి నూతన వస్త్రాలు బహూకరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న కాలనీలో నిర్మిస్తున్న నివాసాల నమూనాను మొట్టమొదటగా తాడేపల్లి బోటు యార్డు వద్ద నిర్మించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పట్లో ఆ గృహాన్ని సందర్శించారు. ఆ గృహాన్ని మంగళవారం ఎమ్మెల్యే ఆర్కే సందర్శించారు. అందులో నివాసముంటున్న కిన్నెర కమలకుమారి, వెంకటకృష్ణ దంపతులు జగనన్న మొట్టమొదటగా గృహ ప్రవేశం చేసిన ఇల్లు మాకు కేటాయించడం ఎంతో ఆనందంగా ఉందని తెలియజేశారు. ఎమ్మెల్యే ఆర్కే వారికి నూతనంగా గృహ ప్రవేశం చేసినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు. గృహ ప్రవేశం చేసిన ఆ దంపతులకు ఎమ్మెల్యే ఆర్కే వైఎస్సార్‌సీపీ నాయకులతో నూతన వస్త్రాలను, పసుపు కుంకుమ, స్వీట్లు, చిన్నారులకు చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో తాడేపల్లి వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ కన్వీనర్ ముదిగొండ ప్రకాష్, బీసీ సెల్ అధ్యక్షుడు బత్తుల దాసు, సోషల్ మీడియా కన్వీనర్ వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో అంతర్జాతీయ సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న ఆర్కిటెక్ట్ డాక్టర్ జి.కార్తీక్, డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో కమ్యూనిక్ అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ఐఐడీ ఆర్కిటెక్ట్ కార్తీక్, విజయవాడ ఆర్కిటెక్చర్ విభాగాధిపతి ఆర్కిటెక్ట్ ప్రియా జాన్సన్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్కిటెక్ట్ కార్తీక్ మాట్లాడుతూ కమ్యూనిక్ అనేది యువ ఆర్కిటెక్ట్‌లకు తెలియజేయడం ప్రథమ ఉద్దేశంగా ఈ సదస్సును నిర్వహించడం ఆనందదాయకమని చెప్పారు. కార్యక్రమంలో డెప్యూటీ స్టేట్ ఆర్కిటెక్ట్ నవీన్ కాంతి, ఆర్కిటెక్ట్ సలీం అన్వర్ ఖురేషి, నవీన్ కణితి, డెప్యూటీ విభాగ అధిపతి ఆర్కిటెక్ట్ కిరణ్‌కుమార్, కేఎల్‌యూ ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికులకు నూతన వస్త్రాలు అందజేత



నూతన వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లి రూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని పసుపు మార్కెట్ యార్డ్‌లో మంగళవారం ముఠా కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, యార్డ్ చైర్మన్ ఎస్‌కే బాజీ ఆధ్వర్యంలో నూతన వస్త్రాలు కార్మికులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ నిధులలో లక్షా 25 వేల రూపాయలు ఖర్చు చేసి యార్డులో పనిచేస్తున్న కార్మికులకు ఈ వస్త్రాలు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ కొండూరు ముత్తయ్య, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ, దుగ్గిరాల సర్పంచ్ బాణావత్ ఖుషీబాయి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

మొదటి రోజు మజ్జిగ పంపిణీ



మజ్జిగ అందజేస్తున్న ప్రముఖ వ్యాపారి శింగంశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు

తాడేపల్లిరూరల్: ఉండవల్లి సెంటర్ నాలుగు రోడ్ల కూడలిలో తండ్రి జ్ఞాపకార్థం ఆయన కుమారులు మంగళవారం చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ వ్యాపారవేత్త శింగంశెట్టి వెంకటేశ్వరరావు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ చికెన్, మటన్ వ్యాపారి గరిక బాలాజీ ఐదేళ్ల క్రితం మృతి చెందారు. ఆయన జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం వేసవి కాలంలో ఆయన కుమారులు చలివేంద్రం ఏర్పాటు చేయడం ఎంతో సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బాలాజి చికెన్, మటన్ సెంటర్ నిర్వాహకులు గరిక దుర్గారావు, గరిక సూరిబాబు, గరిక గోపి, బాలాజీ, స్నేహితులు పాల్గొన్నారు.

ఆర్థిక, ఆరోగ్య అభివృద్ధితోనే సమగ్రాభివృద్ధి

- డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వైద్య సేవలను వినియోగించుకోవాలి
- కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా హెల్త్ సెంటర్‌లలో వైద్య సేవలు
- హెల్త్ సెంటర్‌కు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుకు కృషి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)

మంగళగిరి: దేశం సమగ్రాభివృద్ధి చెందడమంటే ఆర్థిక అభివృద్ధితో పాటు ఆరోగ్య అభివృద్ధి సాధించడమని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పేర్కొన్నారు. నగరంలోని గణపతినగర్‌లోగల డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో మంగళవారం హెల్త్ సెంటర్ కమిటీ చైర్‌పర్సన్ షేక్ రజియా సుల్తాన్ అధ్యక్షతన జరిగిన ఆశా డే సమావేశంలో ఎమ్మెల్యే ఆర్కే పాల్గొన్నారు. తొలుత హెల్త్ సెంటర్‌లోని అన్ని విభాగాలను పరిశీలించి హెల్త్ సెంటర్‌కు ఇంకా అవసరమైన మౌలిక వసతులు ఏవైనా ఉంటే వెంటనే ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నగరంలోని 9 వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా నిర్మించి అన్ని రోగాలకు వైద్య సేవలతో పాటు శస్త్ర చికిత్సలు అందించేలా పది పడకలతో నిర్మాణం చేయడం జరిగిందన్నారు. హెల్త్ సెంటర్‌ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.82 లక్షలు కేటాయించగా నగర పాలక సంస్థ నుంచి మరో రూ.80లక్షలకుపైగా వెచ్చించి అత్యాధునిక హెల్త్ సెంటర్‌లను నిర్మించడం జరిగిందన్నారు. ప్రతి 30 వేల మందికి అందుబాటులో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లు వైద్య సేవలందిస్తున్నందున ప్రజలు కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి అప్పులు పాలుకాకుండా వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లలో అంతకంటే మెరుగైన వైద్య సేవలను అందుకోవాలని కోరారు. రోగులకు సేవలందించేందుకు వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశాలు ఆయా ప్రాంతాల్లోని పాఠశాలల్లో 9, 10వ తరగతులు చదువుతున్న ప్రతి విద్యార్థినికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి వచ్చే సమస్యలపై అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైన వైద్య సేవలతో పాటు నాణ్యమైన మందులు అందజేయాలన్నారు. రాష్ట్రంలోనే ప్రప్రథమంగా జాతీయ నాణ్యత ప్రమాణాలు కలిగిన హెల్త్ సెంటర్‌గా ప్రశంసాపత్రం అందుకునేలా వైద్య సేవలందించాలని ఆకాంక్షించారు. సమావేశంలో నగరపాలక సంస్థ కమిషనర్ యు.శారదాదేవి, అసిస్టెంట్ కమిషనర్ మహాలక్ష్మి దొర, ప్రోగ్రామ్ ఆఫీసర్స్ సుబ్బారావు, లక్ష్మీనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూష, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, కమిటీ సభ్యులు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేపై గ్రామ సభ



మాట్లాడుతున్న తహసీల్దార్ మల్లేశ్వరి

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి మంగళవారం మోరంపూడిలో భూముల రీ-సర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి కొలతలకు చరమగీతం పాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలోనూ పంట భూములను, ప్రభుత్వ భూములను, గ్రామ కంటకాలను రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని చెప్పారు. ఈ రీసర్వే చేసినందుకు ఎవరికీ రూపాయి కూడా చెల్లించవలసిన అవసరం లేదని తెలిపారు. మోరంపూడి గ్రామ చిత్రపటాన్ని చూపించి సర్వే కార్యక్రమం ఏ విధంగా నిర్వహిస్తారో వివరించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సతీష్, సర్పంచ్ ఇత్తడి రమేష్, ఎంపీటీసీ సభ్యులు సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి జయదేవ్, వీఆర్‌వో రత్నకుమారి, గ్రామ సర్వేయర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

మానసిక వికలాంగుడి కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని 15వ వార్డులో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) పర్యటించిన సందర్భంగా ఓ మానసిక వికలాంగుడు కుటుంబాన్ని ఆయన గమనించారు. వెంటనే తన కార్యాలయానికి వెళ్లి ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఆ ఆర్థిక సహాయాన్ని మంగళవారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ నాయకులు ఆ కుటుంబానికి అందజేశారు. తాడేపల్లి 15వ వార్డులో నివాసముండే ఎస్‌కే దావుద్ బాషా అనే 10 సంవత్సరాల బాలుడు మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. తల్లిదండ్రులు లేకపోవడంతో అమ్మమ్మ ఆ భారాన్ని మోస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని స్థానికుల నుంచి సమాచారం అందుకున్న ఎమ్మెల్యే ఆర్కే వెంటనే చలించి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ ఆర్థిక సహాయాన్ని 15వ వార్డు మాజీ కౌన్సిలర్ గంగాధరరావు యాదవ్, మైనార్టీ సెల్ నాయకులు సయ్యద్ రసూల్, సచివాలయ కన్వీనర్ సుబ్బారావు, యువజన విభాగం కన్వీనర్ తుమ్మపూడి మహేష్ దావుద్‌బాషా కుటుంబానికి అందజేశారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్



నిందితులను అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ పోలీసులు

మంగళ గిరి: పెదవడ్లపూడిలోని హిందూ శ్మశాన వాటికలో అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ మారయ్యబాబు మంగళవారం తెలిపారు. వారి వద్ద నుంచి ఒకటిన్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. పెదవడ్లపూడి శ్మశానవాటికలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయనే సమాచారం మేరకు దాడులు నిర్వహించి పెదవడ్లపూడి, భగత్‌సింగ్‌నగర్, బాప్టిస్ట్‌పేటకు చెందిన దిలీప్, వెంకట నాగార్జున, బి.రవిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు. ఎస్ఈబీ ఎస్ఐ మల్లికార్జున్, సిబ్బంది పద్మజ, శ్రీనివాసరావు, హనుమంతు, రజని పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకం

పొన్నెకల్లు(తాడికొండ): భారతదేశ ఆర్థికాభివృద్ధిలో రైతుల పాత్ర కీలకమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను ఉపయోగించుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ మహిళా కళాశాల ఉపాధ్యాయులు వి.కోటేశ్వరరావు, డాక్టర్ ఆర్.ప్రసన్న జోస్పిన్ తెలిపారు. తాడికొండ మండలం పొన్నెకల్లు గ్రామంలో గుంటూరు ప్రభుత్వ మహిళా కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వ్యవసాయదారులకు ప్రభుత్వం ఆధ్వర్యంలో అందిస్తున్న వివిధ పథకాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం, అతివృష్టి, అనావృష్టి వల్ల నష్టపోయిన పంటల బీమా పథకం, ప్రధానమంత్రి రైతు భరోసా పథకం, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ జలకళ, జగనన్న జీవన క్రాంతి, వ్యవసాయ విద్యుత్, వైఎస్సార్ రైతు భరోసా పథకాలను వివరించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయా పథకాలను ఎలా ఉపయోగించుకోవాలి, దరఖాస్తు చేసుకునే విధానం తదితర అంశాలను రైతులకు వివరించి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో పలువురు రైతులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


జగనన్న బడుగు వికాసంతో దళితుల ఆర్థికాభివృద్ధి

- దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జిల్లా కో–ఆర్డినేటర్ మొండితోక జయరాజు

తాడికొండ: రాష్ట్రంలో దళితులు, గిరిజనులు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు జగనన్న బడుగు వికాసం పథకం మంచి అవకాశం అని దళిత్ ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ జిల్లా కో–ఆర్డినేటర్ మొండితోక జయరాజు అన్నారు. మంగళవారం తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామానికి విచ్చేసిన ఆయన మాట్లాడుతూ 2023 సంవత్సరం నుంచి 2027 వరకు నూతన పారిశ్రామిక విధానంలో భాగంగా బడుగు వికాసం పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం దళితులకు తయారీ, సేవా రంగానికి కోటీ 20 లక్షల రూపాయలు ప్రకటించడం గొప్ప విషయమన్నారు. ట్రాన్స్‌పోర్టు రంగానికి రూ.75 లక్షలు ప్రకటించడం కూడా దళితుల ఆర్థికాభివృద్ధిలో భాగమే అని కొనియాడారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి ఏడాది బడుగు వికాసం పథకానికి నిధులు కేటాయిస్తూ రాయితీలు కల్పించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. దళితుల ఆర్థికాభివృద్ధి కోసం అనునిత్యం పోరాటం చేస్తున్న వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. దళిత, గిరిజనులు పరిశ్రమలు స్థాపించిన ఏడాది కాలంలోనే ఈ రాయితీలు విడుదల చేయడం మంచి పరిణామమన్నారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని దళితులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, దళితులకు ఉపయోగపడేలా తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. దళితవాడల్లో సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పించడంతో పాటు దళిత నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని అందిపుచ్చుకునేలా చూస్తామన్నారు. దళితులు పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ప్రభుత్వాలతో ఎంవోయూ కుదుర్చుకోగలిగే స్థాయిలో ఉండేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని చెప్పారు. బడుగు వికాసంలో రాయితీలు కల్పించిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు, ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

తాడేపల్లిరూరల్: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని మంగళగిరి శాసనసభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం దుగ్గిరాల మార్కెట్ యార్డ్‌లో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మంగళగిరి శాసన సభ్యుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని చెప్పారు. అనంతరం మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ బాజి, డీఆర్‌డీఎం పీడీ యుగంధర్, ఎంపీడీవో కుసుమ శ్రీదేవి, దుగ్గిరాల తహసీల్దార్ మల్లేశ్వరి, ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జెడ్పీటీసీ మేకతోటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

- రూ.2 లక్షలు ఆస్తి నష్టం

మేడికొండూరు: మేడికొండూరులో పూరిల్లు దగ్ధమై రూ.2 లక్షలు ఆస్తి నష్టం జరిగిన సంఘటన సోమవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన దేశవరపు చినపిచ్చయ్య బేల్దారీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నారు. తనకు చెందిన పూరింట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి మంటలు వ్యాపించాయి. స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగ్నిమాపక వాహన సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ఇంట్లో వస్తువులన్నీ పూర్తిగా కాలి బూడిదయ్యాయి.